'చంపే అధికారం లేకపోతే పోలీసులకు తుపాకులెందుకిచ్చారు?' అన్న ఎదురుప్రశ్న మొదట్లో తరచుగా వినేవాళ్లం. చదువుకోని వాళ్లకంటే చదువుకున్న వాళ్లనుండే ఎక్కువ వినేవాళ్లం. ఇప్పుడది బాగా తగ్గిపోయింది. అయినప్పటికీ ఎన్‌కౌంటర్ హత్యలు తగ్గకపోగా కొత్త వర్గాలకు విస్తరిస్తున్నాయంటే మన ప్రజాస్వామ్యం దౌర్బల్యం దానికొక కారణం. ప్రజాభిప్రాయం అమోదించని పనులు సాగించుకోవడం అసాధ్యం చేసే బలాన్ని భారత ప్రజాస్వామ్యం ఇంకా పొందలేదు.

ఇప్పుడు అన్నిటికంటే ముఖ్యమైన కర్తవ్యం ఎన్‌కౌంటర్ల మీద హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయించుకోవడం. పాలకుల ప్రయోజనాలకు ఇబ్బందికరమైన కోర్టు తీర్పులూ, రాజ్యాంగ ఆదేశాలూ అమలు కావనేది మన నిత్య జీవిత అనుభవం. అందువల్ల 'ఎన్‌కౌంటర్ల' గురించి ఆందోళన కొనసాగక తప్పదు.

# ? సహజ న్యాయమా.. పోలీసు న్యాయమా?



## ...ఎన్‌కౌంటర్లపై తెగని కోర్టుల మీమాంస

ఎన్‌కౌంటర్‌లన్నీ హత్యలేనని చివరికి హైకోర్టు అననే అనింది. 'వాళ్లే చంపి వాళ్లే అది ఆత్మరక్షణలో జరిగిందని ప్రకటించుకునేటట్టయితే ఇంక కోర్టులెందుకు'? అని చాలా కాలంగా ప్రశ్నిస్తున్న పామర జనంతో రాష్ట్రంలోని అత్యున్నత న్యాయస్థానం గొంతు కలిపింది.

**మరయితే మాకు తుపాకులెందుకిచ్చారు అని కొందరు పోలీసు** సిబ్బంది విస్మయం వ్యక్తం చేసారు. పోలీసులకు తుపాకులిచ్చింది ప్రాణాలు తీయడానికి కాదు, కాపాడడానికి అనేది కూడా వాళ్లు మరిచిపోయినట్టున్నారు. ఒకరి ప్రాణానికి అపాయమో, ఆస్తికి తీవ్ర నష్టమో జరిగే అవకాశం ఉన్నప్పుడు దానిని నివారించడానికి ఇచ్చిన పరిమితమైన బలప్రయోగ అధికారాన్ని ప్రాణాలు తీసే అధికారంగా పోలీసులూ, వారిని తమ సాధనాలుగా వాడుకునే పాలకులూ భావించడం 'ఎన్‌కౌంటర్' హత్యలకు బాటవేసింది. దేశభద్రత కోసం, సామాజిక శాంతి కోసం చంపొచ్చని మొదట్లో సమర్థించుకున్నారు. కరడు గట్టిన నేరగాళ్ల పీడ వదిలించుకోవడానికి ఇదే సరయిన మార్గమని తరువాత దానిని విస్తరించారు. చివరికి 'ప్రజలు కోరుకుంటున్నారు' అనే పేరుమీద చంపడమూ మొదలుపెట్టారు.

**నైతికంగా సమర్థించుకోవడానికి ఈ కారణాలు చూపించినా,** చట్టం ఆమోదం పొందడానికివి సరిపోవు కాబట్టి ఆత్మరక్షణలో చంపారన్నది 'ఎన్‌కౌంటర్ల' కథ అయింది. రానురాను ఈ కథ ఎంత రివాజుగా తయారయిందంటే పోలీసులకు హత్యలు చేసే అధికారం ఉండాలని భావించేవారు సహితం వాటిని నమ్మడం మానేసారు. ఇవ్వాళ పోలీసులు నిజంగానే ఆత్మరక్షణలో ఒకరిని చంపినా ఎవరూ నమ్మని పరిస్థితి ఏర్పడింది. దశాబ్దాల తరబడి అబద్ధాలను ఆశ్రయించడం పోలీసు యంత్రాంగం విశ్వసనీయతను అంతగా దెబ్బతీసింది.

**'ఎన్‌కౌంటర్లు' అనేవి కేవలం ఒకరిద్దరు పోలీసు అధికార్ల తప్పుడు** ఆలోచనల ఫలితంగా జరుగుతున్నవి కావనీ అవి పాలనా విధానంగా, పాలసీగా జరుగుతున్నాయనీ హక్కుల సంఘాలుగా మేము మొదటి నుండి అంటున్నాం. ఈ హంతక విధానాన్ని ఎండగట్టడం, ప్రజలు దానిని నిరసించేటట్లు చేయడం ఒక ముఖ్య కార్యక్రమంగా పెట్టుకున్నాం. పోలీసులు ఒక వ్యక్తిని కాల్చిపారేస్తే ఆ వ్యక్తి మన దృష్టిలో దుర్మార్గుడనో, దేశానికి ప్రమాదకారి అనో మౌనంగా ఉండిపోవద్దనీ, దానివలన ఏ నాగరిక సమాజంలోనూ అధికార యంత్రాంగానికి ఉండకూడని అధికారాలను మనం చేజేతులా ఇచ్చిన వారమవుతామనీ హెచ్చరించడం ఒక పనిగా పెట్టుకున్నాం. ఎన్‌కౌంటర్ హత్యల విషయంలో విస్తృతమైన ఏహ్యభావాన్ని కలిగించడంలో కృతకృత్యులమయ్యామనే భావిస్తున్నాం. 'చంపే అధికారం లేకపోతే పోలీసులకు తుపాకులెందుకిచ్చారు?' అన్న ఎదురుప్రశ్న మొదట్లో తరచుగా వినేవాళ్లం. చదువుకోని వాళ్లకంటే చదువుకున్న వాళ్లనుండే ఎక్కువ వినేవాళ్లం. ఇప్పుడది బాగా తగ్గిపోయింది.

**అయినప్పటికీ ఎన్‌కౌంటర్ హత్యలు తగ్గకపోగా కొత్త వర్గాలకు** విస్తరిస్తున్నాయంటే మన ప్రజాస్వామ్యం దౌర్బల్యం దానికొక కారణం.

ప్రజాభిప్రాయం అమోదించని పనులు సాగించుకోవడం అసాధ్యం చేసే బలాన్ని భారత ప్రజాస్వామ్యం ఇంకా పొందలేదు. అయితే వేరొక కారణమూ ఉంది. సమాజంలో వివిధ కారణాలవల్ల పెరుగుతున్న హింసకు రాజ్యహింసే విరుగుడన్న భావజాలాన్ని పాలకులు సమర్థంగా పెంపొందించగలిగారు. దానికి వంతపాడే మేధావులూ సమాజంలో తయారయ్యారు. పోలీసు హింసాకాండపట్ల హక్కుల ఉద్యమం కలిగించడంలో సఫలం అయిన వ్యతిరేకతను అవతలివైపునుండి అధిగమించడానికి ఈ భావజాలం వ్యాప్తి పాలకులకు అక్కరకొచ్చింది. అనధికార హింసకు అధికార హింస పరిష్కారం అన్న ఆలోచన విధ్వంసకరమైనదన్న ఎరుక సమాజంలో లేకపోలేదు గానీ దాని గొంతు వినపడని మోతాదులో ఈ భావజాలం చేసే రొద ఉంటున్నది. దానిని ఎదుర్కోవడం ఇవాళ హక్కుల ఉద్యమం చేపడుతున్న ఒక ముఖ్య కార్యక్రమం.

**అదే సమయంలో చట్టంద్వారా, న్యాయస్థానాలద్వారా ఈ రాజ్య** హింసాకాండను ఎదుర్కొనే ప్రయత్నమూ చేస్తున్నాం. ఆత్మరక్షణ కోసం ఎదురుదాడి చేసే హక్కు ప్రతీ ప్రాణికీ ఉంది. అది జీవికి ఉండే సహజ హక్కులలో ఒకటి. చట్టమూ దానిని గుర్తించింది. అయితే ఆ హక్కు హింసకు సాకు కాకుండ చూడడానికి చట్టం దానికి పరిధులు నిర్దేశించింది. ప్రమాదాన్ని అధిగమించే మేరకు చేసే ఎదురుదాడి మాత్రమే ఆత్మరక్షణ కిందికి వస్తుందనీ దానిని దాటిపోతే నేరం అవుతుందనీ చట్టం అంటుంది. 'ఆత్మరక్షణ' పేరిట జరిగిన దాడి ఆ పరిధికి లోబడి ఉందా లేదా అని తేల్చడానికి నిష్పాక్షికమైన విచారణ జరగాలని చట్టం అంటుంది. ఇది సాధారణ పౌరులకెంత మేరకు వర్తిస్తుందో పోలీసు సిబ్బందికీ సైనిక సిబ్బందికీ కూడ అంతే మేరకు వర్తిస్తుంది.

**ఈ వాదన న్యాయస్థానాలలో చేయగా చేయగా 1995లో** మొదటిసారి మన రాష్ట్ర హైకోర్టు దీనితో ఏకీభవించింది. దాదాపు అదే సమయంలో 'ఎన్‌కౌంటర్ల'పైన విచారణ చేపట్టి 1996లో ఆదేశాలు జారీ చేసిన జాతీయ మానవ హక్కుల కమిషన్ కూడ ఏకీభవించింది. ప్రతీ ఎన్‌కౌంటర్ ఘటనపై ఎవరి ఫిర్యాదూ అవసరం లేకుండ కేసు నమోదు చేయాలనీ, దానిపైన నిష్పాక్షికమైన నేరపరిశోధన జరగాలనీ, ఆ హత్య ఆత్మరక్షణలో జరిగిందా లేదా అనేది న్యాయస్థానం తేల్చాలనీ హైకోర్టు, జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశించాయి. న్యాయపోరాటం సూత్రప్రాయంగా అక్కడితో అయిపోవలసిందేగానీ ఆ తరువాత హైకోర్టు అందుకు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేయడంవల్ల మళ్లీ మళ్లీ వాదనలు జరపవలసి వచ్చింది. చివరికి ఐదుగురు న్యాయమూర్తుల బెంచి ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించిన తీర్పులో హక్కుల సంఘాల వాదనను సమర్థించింది. ఇప్పుడు రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం దానిని సుప్రీం కోర్టులో సవాలు చేసింది కాబట్టి ఇక ఈ సంవాదం ఢిల్లీలో కొనసాగుతుంది.

**హైకోర్టు తీర్పులో రెండు మూడు విషయాలు అస్పష్టంగా** ఉండిపోయాయి. 1. ప్రతీ 'ఎన్‌కౌంటర్' పైనా నేరం నమోదు కావాలనీ నిష్పాక్షికమైన నేర పరిశోధన జరగాలనీ అన్నారు బాగానే ఉంది గానీ నేర పరిశోధన ఎవరు చేయాలి? 1996లో జాతీయ మానవ హక్కుల కమిషన్ ఇచ్చిన ఆదేశంలో 'స్థానిక పోలీసు యాంత్రాంగంనుండి వీలయినంత వరకు స్వతంత్రులయిన' యంత్రాంగం నేర పరిశోధన జరపాలని అన్నారు. అటువంటి యంత్రాంగం ఎక్కడుంది? 'సిబిఐ విచారణ' అని వివిధ సందర్భాలలో చాలామంది డిమాండ్ చేస్తుంటారు గానీ సిబిఐలో ఉండే అధికారులు వివిధ రాష్ట్రాల పోలీసు యంత్రాంగం నుండి తీసుకోబడ్డవారే. ఇప్పుడు 'ఎన్‌కౌంటర్‌లు' అన్ని రాష్ట్రాలకూ పాకాయి కాబట్టి వారినుండి నిష్పాక్షికతను కూడా ఆశించలేం.

**జాతీయ, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లకు అనుబంధంగా** నేరపరిశోధక శాఖలున్నాయి. అయితే వాటి సిబ్బందినీ అధికారులనూ వివిధ రాష్ట్రాల పోలీసు యంత్రాంగాల నుండి, కేంద్ర పారా మిలిటరీ నుండి డిప్యుటేషన్ మీద తీసుకుంటున్నారు తప్ప స్వతంత్రంగా ఎంపిక చేయడం లేదు. ఈ పద్ధతి మానేసి వారిని విడిగా ఆయా మానవ హక్కుల కమిషన్‌లే ఎంపిక చేయాలనీ, వారికి పోలీసు యంత్రాంగాలతో శాఖాపరమైన సంబంధాలేవీ ఉండకూడదనీ ఒక నియమం చేసి వారికే పోలీస్ ఎన్‌కౌంటర్లు, చిత్రహింసల కేసుల పరిశోధన అప్పగిస్తే కొంతవరకయినా స్వతంత్రమైన నేరపరిశోధన జరగవచ్చు.

**మేజిస్ట్రేట్లకు అవసరమయిన శిక్షణ రెండవ సమస్య.** ఎన్‌కౌంటర్‌పైన కేసుపెట్టి నేరపరిశోధన జరిపే యంత్రాంగం అది నిజంగా ఎదురు కాల్పుల ఘటనేనని ఒకవేళ భావించి రిపోర్టు నమోదు చేసినా కూడ మేజిస్ట్రేటు దానిని ఆమోదించనవసరం లేదనీ తన విజ్ఞత ఉపయోగించి విభేదించవచ్చునీ చట్టం చెప్తుంది. హైకోర్టు ఆ మాటే అనింది. కానీ దానికి కావలసిన శిక్షణ, చొరవ మేజిస్ట్రేట్లకు ఉందా? నేరపరిశోధన జరిపిన యంత్రాంగం ఏం దాచిపెట్టిందో చూసి మళ్లీ పరిశోధన జరపమని ఆదేశించాలి లేదా వారు సేకరించిన సమాచారం నుండే భిన్న అభిప్రాయానికి రావాలి. దీనికి కావలసిన యోగ్యత సగటు మేజిస్ట్రేట్‌లలో లేదు. పోలీసు హింస ఒక ముఖ్యమైన సమస్య కాబట్టి ఈ కర్తవ్యానికి అవసరమైన శిక్షణ మేజిస్ట్రేట్లకు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ శిక్షణ హక్కుల ఉద్యమంలో అనుభవం ఉన్న సీనియర్ న్యాయవాదులచేత ఇప్పించడమే ఉచితంగా ఉంటుంది.

**ఈ రెండవ సమస్యలోనే మూడవ సమస్య ఇమిడి ఉంది.** ఒక ఫిర్యాదును పరిశోధించిన పోలీసులు అందులో నిజం లేదన్న అభిప్రాయానికొచ్చి మేజిస్ట్రేట్ కోర్టులో నివేదిక దాఖలు చేసినప్పుడు ఫిర్యాదికి ఆ విషయం తెలియజేయాలని చట్టం అంటుంది. అప్పుడు ఫిర్యాదికి తన అభ్యంతరాలు మేజిస్ట్రేటుకు చెప్పే అవకాశం లభిస్తుంది. ఇది పోలీసుల నివేదికను పరిశీలించే విషయంలో మేజిస్ట్రేట్‌కు తోడ్పడుతుంది. అయితే 'ఎన్‌కౌంటర్'లో చంపిన పోలీస్ అధికారే 'ఫిర్యాది'. అతని సమాచారం మీదనే కేసు నమోదవుతుంది. కాబట్టి చట్టం ఫిర్యాదికి ఇచ్చే హక్కు ఎన్‌కౌంటర్ కేసులో ఉపయోగపడదు. కేవలం ఫిర్యాదికే కాక మృతుల కుటుంబానికి కూడా తెలియజేయాలనీ వారి జాడ తెలియని పక్షంలో పత్రికా ప్రకటన ద్వారా ప్రజాబాహుళ్యానికి తెలియజేయాలనీ నియమం ఉండడం అవసరం. లేకపోతే వ్యవహారం మొత్తం పోలీసులకూ మేజిస్ట్రేటుకూ మధ్యనే ఉండిపోయే ప్రమాదం ఉంది.

**హైకోర్టులో జరిగిన వాదనలలో ప్రధాన విషయం మీదే దృష్టి** కేంద్రీకరించడం వల్ల ఈ మూడు సమస్యల ప్రస్తావన పెద్దగా రాలేదు. తీర్పులోనూ వీటి ప్రస్తావన లేదు. భవిష్యత్తులో కోర్టులోపలా బయటా వీటి గురించి కృషి చేయవలసి ఉంది. అయితే అన్నిటికంటే ముఖ్యమైన కర్తవ్యం ఈ తీర్పును అమలు చేయించుకోవడం. పాలకుల ప్రయోజనాలకు ఇబ్బందికరమైన కోర్టు తీర్పులూ, రాజ్యాంగ ఆదేశాలూ అమలు కావనేది మన నిత్య జీవిత అనుభవం. అందువల్ల 'ఎన్‌కౌంటర్ల' గురించి ఆందోళన కొనసాగక తప్పదు.

**హైదరాబాద్**

**19-3-2009**

**- మానవ హక్కుల వేదిక (HRF)**

**- ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)**